క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.కాశయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నకరికల్లు: పేదలను ఆదుకునేందుకు తమ సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీం లీడర్ షేక్ అబ్దుల్లా తెలిపారు. మండలంలోని బాలాజీనగర్ తండాలోని పేదలకు లుక్స్ కల్చరల్ మీడియా లిమిటెట్ సంస్థ తరపున సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లుక్స్ కల్చరల్ సంస్థ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు విస్తృత స్థాయిలో చేపడుతుందని అన్నారు. తండాలోని 40 కుటుంబాలకు నిత్యావస సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శీలం వెంకటేష్, తొమ్మండ్రు మల్లిఖార్జున, సానా గోపి, షేక్ ఆరిఫ్, దుర్గాప్రసాద్ నాయక్, సుబ్బు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని ఎస్సీ లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో పార్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాలకు, గత 5 సంవత్సరాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి లబ్ధి పొందని, దారిద్ర్య రేఖకు దిగువనున్న అభ్యర్థులు మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల స్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ నిబంధనలు, లక్ష్యాల మేరకు ప్రాథమిక ఎంపిక చేసి, పథకాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఈ పథకాలకు లబ్దిదారులు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రము కలిగి ఉండవలెనన్నారు. ఆటో రుణాలకు పరిమితి కలిగిన లైసెన్స్, బ్యాడ్జి తప్పనిసరని అన్నారు. అభ్యర్థులను మండల స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీ అధికారులు, బ్యాంకు మేనేజర్లు ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పని దినములలో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ సత్తెనపల్లి మాజీ శాసన సభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో 29న మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



సత్తెనపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సోమవారం రాత్రి జర్నలిస్టుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర వాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎల్రక్టానిక్, యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మాచర్ల ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు నరహరి, ప్రధాన కార్యదర్శి సోమయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత ఉత్తర్వులు అన్ని డిపోల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్ ఆపాలన్నారు. ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ జీఓ ప్రకారం మహిళ ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

పేదల ఇళ్లపై నిర్లక్ష్యం

- చిట్టడవిని తలపిస్తున్న జగనన్న కాలనీలు
- ఇళ్లు మంజూరు చేయాలని లబ్ధిదారుల డిమాండ్
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉప్పలపాడులో చిట్టడవిని తలపిస్తున్న ఇళ్ల ప్లాట్లు

రాజుపాలెం: కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లపైనిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా పేదల కోసం కేటాయించిన నివేశన స్థలాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో చిట్టడవిని తలపిస్తున్నాయి. మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలను గుర్తించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. ఆ ప్లాట్స్‌లో ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వందల కోట్ల రూపాలయ ఖర్చు పెట్టి రైతుల వద్ద తీసుకున్న భూములను ప్లాట్‌లుగా విభజించి పంపిణీ చేశారు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లను పట్టించుకోకపోవడంతో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి.

1,042 మందికి ఇళ్ల పట్టాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 17 పంచాయతీలలో 17 లే అవుట్‌లు వేసి జగనన్న కాలనీలుగా ఏర్పాటు చేశారు. 1,042 మంది అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులను గుర్తించడంలో పార్టీలు, కులమతాల వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా ఎంపిక చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు కూడా ముగింపు గడువు లేకుండా వెసులుబాటు కల్పించారు. లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పలు కోణాలలో పరిశీలించి అధికారులు అర్హులైన వారి జాబితాను పారదర్శకంగా సిద్ధం చేశారు. మొత్తం 1042 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలను ఇచ్చి, ఆశ్రయం కల్పించాలని ప్రయోజనం చేకూర్చారు. ఆ సమయంలో లబ్దిదారులను ప్లాట్ల వద్ద ఉంచి జియో ట్యాగ్ ప్రక్రియ పూర్తి చేశారు.

ఇళ్లు మంజూరు చేయాలి

2024లో జరిగిన ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గొప్ప ఉద్దేశంతో పేదలకు కేటాయించిన ప్లాట్ల పరిస్థితి అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారుల పరిశీలన పేరుతో ఇళ్ల పట్టాలు పొందిన వారి నుంచి జిరాక్స్ పత్రాలను తీసుకున్నారు. ఇళ్లు మంజూరు చేస్తారేమోనని ఆశగా చూసిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. కంటితుడుపు చర్యగా జిరాక్స్ పత్రాలు తీసుకున్నారే తప్ప తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ ప్లాట్ల గురించి పట్టించుకునే నాథుడే లేడు. దీంతో ప్లాట్ల నిండా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఎవరి ప్లాట్ ఎక్కడ ఉందో గుర్తు పట్టే స్థితిలో ప్లాట్స్ లేవు. ప్లాట్లకు నలువైపుల వేసిన హద్దు రాళ్లను గుర్తు తెలియని దుండగులు పీకేశారు. దీంతో లబ్ధిదారుల ఆశ అడియాశగానే మిగిలింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్లాట్లను అభివృద్ధి చేసి ఇళ్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అనుమతులు ఇవ్వాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఇళ్ల పట్టాల సంగతే మరిచారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి.

– జొన్నకూటి కుమారి, ఉప్పలపాడు

ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం బంధువుల ఇళ్లల్లో ఉంటున్నాం. గత ప్రభుత్వం మాకు ప్లాటు ఇచ్చింది. దానికి సంబంధించిన పట్టా ఇచ్చారు. ఇల్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేయాలి.

– కుంభా వెంకటేశ్వర్లు, రాజుపాలెం

పరిశీలన తరువాతే మంజూరు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తాం. ప్రభుత్వం ఇచ్చే సూచనల ప్రకారం హౌసింగ్ బోర్డు ద్వారా లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తాం.

– దుర్గేష్‌రావు, తహసీల్దారు, రాజుపాలెం

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధ్వంసం చేసిన రహదారి

సత్తెనపల్లి: పట్టణంలోని 30వ వార్డు వైన్ షాప్ ఎదురుగా స్థలం కొలత తక్కువగా ఉందని కొంత వరకు రోడ్డును ధ్వంసం చేసి ఆక్రమించారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు సోమవారం ఆందోళన నిర్వహించారు. పార్కు ఎదురు రోడ్డు విశాలంగా ఉండాలని గతంలో పని చేసిన శాసనసభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏర్పాటు చేస్తే 15 ఏళ్ల వదిలేసి స్థల దాతలు రోడ్డును ఆక్రమించుకొని రాత్రికి రాత్రే రోడ్డు తవ్వి ఎంత స్థలం పోయిందో ఆ స్థలం వరకు కొలతలు వేసుకొని ఆక్రమించుకున్నారన్నారు. పబ్లిక్‌గా ప్రధాన సెంటర్‌లో రోడ్డును ధ్వంసం చేస్తుంటే మున్సిపల్ అధికారులు గానీ, పోలీసులు, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రోడ్డు విషయంలో కలుగజేసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

జాబు కార్డు ఉంది.. పని కల్పించండి



ఉపాధి పని కల్పించక పోవడంతో వెనుదిరిగిన కూలీలు

రాజుపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలకు పని కల్పించక పోవడంతో ఇళ్లకు వెనుదిరిగారు. రెండు రోజుల క్రితం రాజుపాలెంలో ఎట్టకేలకు ఉపాధి పనులను ప్రారంభించారు. సోమవారం ఎక్కువ సంఖ్యలో ఉపాధి కూలీలు హాజరయ్యారు. సుమారు 20 నుంచి 30 మంది కూలీల పేర్లు లిస్టులో లేకపోవడంతో అవాక్కయ్యారు. పనిచేయిస్తున్న బీఎఫ్‌టీ జె.లక్ష్మిని పని కల్పించాలని కోరారు. ప్రతి ఏటా పనులకు వస్తున్నామని, జాబ్ కార్డు కూడా కలిగి ఉన్నామని, లిస్టులో పేర్లు లేకపోవడమేమిటని బీఎఫ్‌టీని అడుగగా.. నాకు తెలియదు, కార్యాలయానికి వెళ్లి ఏపీవోను, ఎంపీడీవోను సంప్రదించాలని తెలిపారు. దీంతో చేసేది లేక కూలీలు వెనుదిరిగారు. వెనుదిరిగిన కూలీలు పని కల్పించాలని అధికారులను కోరారు.

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు

సత్తెనపల్లి: భవన నిర్మాణాలకు సులభతరంగా అనుమతులు పొందేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నం.20, 2025 ఫిబ్రవరి 4 ద్వారా స్వీయ ధ్రువీకరణ పథకం–2025లో భాగంగా ప్రజలు స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రం సమర్పించి సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు మున్సిపల్ కార్యాలయం ద్వారా లైసెన్సు పొందబడిన లైసెన్సు టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్, ఇంజనీర్ల ద్వారా గ్రామ కంఠం, అప్రూవ్డ్ లే అవుట్లు తదితర ప్రాంతాల్లో నివాసం కొరకు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి సులభంగా, వేగంగా, పారదర్శకంగా అనుమతులు పొందగలరన్నారు. అదే విధంగా ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు (ఐటీఐ, డిప్లమా, బీటెక్ సివిల్) పురపాలక సంఘ కార్యాలయంలో గానీ ఏపీఓబీఎస్, ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందవలసిందిగా తెలిపారు. వివరాలకు నూతన ఎల్‌టీపీ లైసెన్స్ కొరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ 9059842957 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు తిరుకుటుంబ దేవాలయం ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దేవాలయం

అచ్చంపేట: మండలంలోని తాడువాయిలో దాతల సహాయ సహకారాలతో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన తిరుకుటుంబ దేవాలయం మంగళవారం ప్రారంభానికి సిద్ధమైంది. అధునాతన వసతులతో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. రెవరెండ్ ఫాదర్ పుట్టి అంతోనిరాజు ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావులు హాజరుకానున్నారు. చర్చి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే శంకరరావు సుమారు రూ.18 లక్షల విరాళాన్ని ఇచ్చి ప్రజలపై విశ్వాసం, ఏసుక్రీస్తుపై ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ఏసుక్రీస్తు ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

రేపు త్రిపురాపురంలో ప్రతిష్ఠా మహోత్సవాలు



త్రిపురాపురం గ్రామంలో ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయాలు



ప్రతిష్ఠ సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించిన విఘ్నేశ్వర ఆలయం



యాగశాలలో యాగాలు చేస్తున్న వేద పండితులు

- ముస్తాబైన ఐదు ఆలయాలు
- 28న ప్రారంభమైన ప్రతిష్ఠ వేడుకలు
- 30న ప్రతిష్ఠామహోత్సవాలు, మహా అన్నదానం

నకరికల్లు: మండలంలోని త్రిపురాపురం గ్రామంలో నూతనంగా నిర్మించబడిన ఐదు ఆలయాలు ప్రతిష్ఠకు ముస్తాబయ్యాయి. ఈ నెల 28న సోమవారం ప్రారంభమైన ప్రతిష్ఠా వేడుకలు 30వ తేదీ శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు, మహా అన్నదానంతో ముగియనున్నాయి. విఘ్నేశ్వర ఆలయం, ధ్వజ స్తంభం, కల్యాణ వేంకటేశ్వరస్వామి, పోలేరమ్మ, పాతపాటేశ్వరి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి, పోతురాజు స్వామి, అంకమ్మతల్లి, నీలంపాటి అమ్మవార్ల స్థిర విగ్రహములు, జీవ ధ్వజ, కీర్తి ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నారు. విశ్వావసు నామ సంవత్సర వైశాఖ శుద్ధ పాడ్యమి సోమవారం ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానంతో ముగుస్తాయి. త్రయాహ్నిక దీక్షచే వేదపండితుల మంత్రోచ్చారణల నడమ వేడుకలా నిర్వహించనున్నారు. 30వ తేదీ ఉదయం శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు, కల్యాణ వేంకటేశ్వరుని శాంతి కల్యాణం, వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

గ్రామస్తులంతా కలసి...

మండలంలోని త్రిపురాపురం గ్రామం కేవలం 1100 మంది జనాభా కలిగిన అతి చిన్న గ్రామం. గ్రామంలో నూతన ఆలయాలు నిర్మించి దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులందరూ కలసికట్టుగా పూనుకున్నారు. పార్టీలకు అతీతంగా చేయి చేయి కలిపి వేడుకలు వైభవంగా జరుపుకునేందుకు ముందుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఆలయాలు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల విరాళాలతో పాటు పలు గ్రామాల భక్తులతో మహత్కార్యానికి పునాది వేశారు. విఘ్నేశ్వర ఆలయం, ధ్వజ స్తంభం, ఆలయ గాలిగోపురం నిర్మాణంతో పాటు ఆలయాల నిర్మాణాలు ప్రారంభించారు. అనతి కాలంలోనే విశాలమైన ప్రాంగణంలో ఆలయాలను తీర్చిదిద్దారు. బెల్లంకొండ శ్రీరామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో బెల్లంకొండ పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించనున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



గ్రంథాలయంలో పుస్తక పఠనంలో చిన్నారులు



క్రోసూరు గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

సత్తెనపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వేసవి శిక్షణ తరగతులకు తొలి రోజు ఎనిమిది మంది విద్యార్థులు హాజరు కాగా వారికి స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, కథలు చదివించడం వంటివి చేపట్టినట్లు గ్రంథాలయ అధికారి వాణి తెలిపారు. విద్యార్థులు మరింత మంది హాజరై వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు.

అమరావతిలో...

అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రాంభించారు. ఈ శిబిరంలో తొలిరోజు చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, సూర్య నమస్కారాలు, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. తొలుత అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయాధికారి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించటానికి కథలు చెప్పటం, డ్రాయింగ్, పెయింటింగ్ నేర్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసవిలో గ్రంథాలయానికి పంపితే వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రోసూరులో...

క్రోసూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయంలో 40 రోజుల పాటు జరిగే వేసవి విజ్ఞాన శిబిరాలకు పంపాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని హిందీ ఉపాధ్యాయులు షేక్ సుభాని అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి ప్రసంగించారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులు ఎన్నో అంశాలను తెలుసుకోవచ్చునన్నారు. జీకే, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. తొలి రోజు 20 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. మోటివేషన్, జీకే తరగతులు చెప్పటం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్న దృశ్యం

ప్రముఖ హార్మోనిస్ట్ ఖుదావన్‌కు నివాళులు

క్రోసూరు: ప్రముఖ హార్మోనిస్టు , లయబ్రహ్మ షేక్ ఖుదావన్ 24వ వర్ధంతి కార్యక్రమం సోమవారం క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఖుదావన్ పేరుతో నిర్మించిన కళాక్షేత్రంలో నిర్వహించారు. కళాబంధు బొబ్బిళ్లపాటి గోపాల సాయికృష్ణ ఆధ్వర్యంలో ఖుదావన్ కుటుంబ సభ్యలతో కలిసి గొప్ప సాంస్కృతిక కార్యక్రమాలతో నాటకరంగ అభిమానులను, ఖుదావన్ అభిమానులకు, కళాకారులను అలరించారు. ముందుగా షేక్ ఖుదావన్ చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి నాదస్వర కళాకారుడిగా జీవితం ఆరంభించి కఠోర శ్రమ, అకుంఠిత దీక్షతో సుప్రసిద్ధ హార్మోనిస్టుగా ప్రఖ్యాతి గడించాడు. ఖుదావన్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. కళాక్షేత్రంలో నందిగామ కోయిల రంజాన్‌బీ ఆపాత మధురాలు (ఆర్కెస్ట్రా), ఒంగోలు వేదవతి భాగవతారిణిచే నర్తనశాల హరికథ, సందేశాత్మక నాటిక నాన్న–నేనొచ్చేస్తా, అనంతరం ప్రముఖ సంఘ సంస్కర్త కాళ్లకూరి నారాయణరావు రచించిన భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాభిమానులు, ప్రజలు అశేషంగా పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

తహసీల్దార్ భవానిశంకర్



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామ సచివాలయంలో సర్వే సిబ్బందితో సోమవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రోజూ రెండు షిఫ్టులుగా సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. మొత్తం ఆరు టీములు సర్వేలో పని చేస్తున్నాయని, మరో వారం రోజుల్లో గ్రౌండ్ ట్రూతింగ్(జీటీ) పనులు పూర్తి కావాలని, పూర్తి స్థాయి సర్వే వెంటనే ప్రారంభించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని సూచించారు. ఆక్షేపణలు ఉన్న రైతులను వారి వద్ద నున్న ఆధారాలతో హద్దులు చూపించాల్సి ఉందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పనులను డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదుతో కలసి పరిశీలించారు. మండల సర్వేయర్ టీ సుధాకర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

గిన్నీస్ బుక్ రికార్డు సాధించిన అంకిత్‌పాల్‌కు సత్కారం



అంకిత్‌పాల్‌ను సత్కరిస్తున్న మల్లికార్జునరావు, అభ్యుదయ విజ్ఞాన సమితి బాధ్యులు

సత్తెనపల్లి: తల్లిదండ్రులు బిడ్డలకు చదువు చెప్పిస్తే అదే వారికి ఇచ్చే నిజమైన ఆస్తి అని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు అన్నారు. సత్తెనపల్లి (రామకృష్ణాపురం) పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న పత్తిపాటి అంకిత్ పాల్ విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా సంగీతం నేర్చుకుని 2024 డిసెంబర్ 1న 18 దేశాల్లోని 1,046 మందితో స్వరాలు ఆలపించి రికార్డును సొంతం చేసుకుని గిన్నీస్ బుక్ రికార్డు ధ్రువీకరణ పత్రం పొందిన సందర్భంగా సోమవారం అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థులకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. గిన్నీస్ బుక్ రికార్డు సొంతం చేసుకున్న అంకిత్‌పాల్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంకిత్‌పాల్, అతని తండ్రి జేజే ట్యూషన్ నిర్వాహకుడు పత్తిపాటి బాబును ప్రత్యేకంగా అభినందించి, అంకిత్‌పాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అభ్యుదయ విజ్ఞాన సమితి బాధ్యులు షేక్ జాకీర్, కూనాగు వెంకటేశ్వర్లు (బుజ్జి), దివ్వెల శ్రీనివాసరావు, చిలకల శ్రీనివాసరావు, కొల్లిపర వాసు, పెరుమాళ్ళ పూర్ణచంద్రరావు, పిల్లుట్ల ఆంజనేయులు, షేక్ ఖాజావలి తదితరులు ఉన్నారు.

ది ఇండియన్ ఐకాన్ స్కూల్‌కు రికగ్నైజేషన్

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని ది ఇండియన్ ఐకాన్ స్కూలుకు రికగ్నైజేషన్ లభించిందని సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి–1 ఏ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు ది ఇండియన్ ఐకాన్ స్కూల్‌ను రికగ్నైజేషన్ చేస్తూ ఆర్సీ నెంబర్: 283224100107 జారీ చేశారన్నారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఆ పాఠశాలలో విద్యార్థులను చేర్చ వచ్చని తెలియజేశారు.

విత్తనశుద్ధితో పైరుకు ప్రయోజనాలు



నకరికల్లు: విత్తనం నాటే ముందు శుద్ధి చేసుకోవడం ద్వారా పంటలకు చీడపీడలు ఆశించకుండా నివారించవచ్చని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు వివరించారు. విత్తనశుద్ధి విధానంపై రూపెనగుంట్ల గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. సూడోమోనాస్‌తో విత్తనశుద్ధిని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వారు మాట్లాడుతూ వరి తదితర పంటలలో విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ, దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. పైరు పచ్చగా కళకళలాడుతుందని తెలిపారు. నత్రజని అందించి మొక్కల పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ హనుమంతరావు, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.